క్లుప్తంగా

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి



వర్ని: సైబర్ నేరాలపై విద్యార్థులు, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్సై కృష్ణకుమార్ సూచించారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సైబర్ నేరాలపై విద్యార్థులకు శుక్రవారం అవగాహన కల్పించారు. ఓటీపీ, బ్యాంకు వివరాలు అపరిచితులకు చెప్పొద్దని సూచించారు. మైనర్లు వాహనాలు నడపరాదని, ప్రమాదాలు జరిగితే ప్రాణాలను కోల్పోవాల్సిన దుస్థితి ఏర్పడుతుందని వివరించారు. కళాశాల ప్రిన్సిపాల్ కల్పనకుమారి, సిబ్బంది పాల్గొన్నారు.

పదోన్నతితో ఉపాధ్యాయులకు మేలు



బోధన్: పదోన్నతితో ఉపాధ్యాయులకు ఎంతో మేలు జరిగిందని పీఆర్టీయూ డివిజన్ బాధ్యుడు ఎంబెల్లి శంకర్ అన్నారు. పదోన్నతి పొందిన ఉపాధ్యాయులతో సీఎం రేవంత్ రెడ్డి శుక్రవారం హైదరాబాద్లో ఏర్పాటు చేసిన సమావేశానికి బోధన్ నుంచి 250 మంది ఉపాధ్యాయులు బస్సుల్లో తరలివెళ్లారు. ఎంఈవో నాగ్నాథ్, పీఆర్టీయూ జిల్లా గౌరవ అధ్యక్షుడు ఇల్తెపు శంకర్, మండల ప్రతినిధులు కైరాన్, ధన్రాజ్, గంగాధర్, శ్రీనివాస్ రెడ్డి, సుధీర్, ఉదయ్, కిశోర్, శంకర్, వివిధ ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

విగ్రహ దాతకు సన్మానం



నందిపేట్: మండలంలోని మాయపూర్లో కాలా మైసమ్మ ఆలయ పునర్నిర్మాణం సందర్భంగా అదే గ్రామానికి చెందిన సాయి కాలేజ్ ఆఫ్ హోటల్ మేనేజ్మెంట్ ప్రిన్సిపాల్ కసిరెరె సతీశ్ రూ. రెండు లక్షలు విలువ చేసే అమ్మవారి విగ్రహాన్ని విరాళంగా అందించనున్నట్లు ప్రకటించారు. ఈ సందర్భంగా వీడీసీ సభ్యులు విగ్రహ దాతకు కృతజ్ఞతలు తెలిపి సన్మానించారు. దాతలు తోచిన సహాయం చేయాలని సభ్యులు కోరారు.

కోటగిరి తహసీల్దార్గా గంగాధర్



వర్ని: కోటగిరి తహసీల్దార్గా కాంబ్లే గంగాధర్ శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. గతంలో పనిచేసిన సునీత నిజామాబాద్ కలెక్టర్ కార్యాలయానికి బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ.. ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. ఇసుక రవాణాకు ప్రభుత్వ అనుమతి అవసరమని ఎవరైనా అక్రమంగా రవాణా చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

జీవన భృతి పెంచాలి



మోర్తాడ్: బీడీ కార్మికులకు జీవన భృతిని రూ. 4,016కు పెంచాలని డిమాండ్ చేస్తూ బీడీ కార్మికులు శుక్రవారం మోర్తాడ్లో ర్యాలీ నిర్వహించి తహసీల్ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. కార్యక్రమంలో నాయకులు దేవారాం, ముత్తెన్న, సారా సురేష్, సత్తెక్క, కిషన్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

ట్రాక్టర్స్ యూనియన్ ఎన్నిక



డొంకేశ్వర్: మండలంలోని నికాల్పూర్ ట్రాక్టర్స్ యూనియన్ ఏకగ్రీవంగా ఎన్నికైంది. యూనియన్ అధ్యక్షుడిగా కొండా సుధాకర్, కార్యదర్శిగా కుమ్మరి ముత్యం ఎన్నికయ్యారు. యూనియన్ శ్రేయస్సు కోసం పని చేస్తామని వారు తెలిపారు. అనంతరం నూతన కార్యవర్గాన్ని సభ్యులు సన్మానించారు.

మహాలక్ష్మి ఆలయంలో పూజలు



ఆర్మూర్ టౌన్: పట్టణంలోని మహాలక్ష్మి ఆలయంలో భక్తులు శుక్రవారం ప్రత్యేక పూజలు చేశారు. ఆషాఢ మాసం చివరి శుక్రవారం కావడంతో ఆలయాన్ని అందంగా ముస్తాబు చేశారు. భక్తులు అమ్మవారిని దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు.

గుంతల రోడ్లతో అవస్థలు

- ఇబ్బందుల్లో వాహనదారులు
- పట్టించుకోని అధికారులు



గొట్టిముక్కల-మాందాపూర్ బీటీ రోడ్డుపై ఏర్పడిన గుంత



జన్నేపల్లి వంతెనపై ప్రమాదకరంగా మారిన రోడ్డు

మాక్లూర్: గుంతల రోడ్లతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మండలంలోని పలు బీటీ రోడ్లపై భారీ గుంతలు ఏర్పడ్డాయి. దీంతో నడక యాతనగా మారింది. భారీ గుంతలతో పలువురు వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. మండలంలోని చిక్లి శివారులో ఉన్న జన్నేపల్లి బ్రిడ్జిపై గతేడాది భారీ గుంత ఏర్పడింది. దీంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడడంతో సంబంధిత అధికారులు మరమ్మతు పనులను కాంట్రాక్టర్తో చేయించారు. కానీ కాంట్రాక్టర్ వంతెనపై ఒక భాగం పనులు చేపట్టి మిగతా భాగం చేయలేదు. 6 నెలలు అవుతున్నా గుంతలపై మరమ్మతు పనులు చేపట్టకపోవడంతో వాహనదారులు, ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దీంతో వర్షం కురిసిన ప్రతిసారి గుంతల్లో నీరు చేరడంతో గమనించని వాహనదారులు వాటిపై ప్రయాణిస్తూ ప్రమాదాలకు గురవుతున్నారు. కొందరికి తీవ్రగాయాలైన ఘటనలు అనేకం ఉన్నాయి.

అలాగే చిక్లి శివారులోని సబ్స్టేషన్కు సమీపంలో బీటీరోడ్డు మధ్యలో పెద్ద గుంత ఏర్పడింది. ఈ ప్రాంతంలో భారీ రోడ్డు ప్రమాదాలు జరుగుతుండటంతో స్థానిక పంచాయతీ కార్యదర్శి యెండెల రాజేశ్ తన సొంత డబ్బులతో గుంతను తాత్కాలికంగా పూడ్చివేయించారు. గొట్టిముక్కల, మాందాపూర్ మధ్యలో బీటీ రోడ్డు అడుగు భాగంలో ఉన్న కల్వర్టు పైప్ పగిలి పెద్ద గుంత ఏర్పడింది. ఈ ప్రాంతంలో కూడా ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. ఈ మూడు ప్రాంతాల్లో తరచూ ప్రమాదాలు జరుగుతున్నా సంబంధిత అధికారుల్లో మాత్రం చలనం లేకుండా పోతోంది. ఇకనైనా ఉన్నతాధికారులు స్పందించి భారీ గుంతలను పూడ్చివేయాలని గ్రామస్తులు, వాహనదారులు కోరుతున్నారు.

మరమ్మతులు చేయించాలి

చిక్లి బ్రిడ్జిపై ఏర్పడిన గుంతలను త్వరగా మరమ్మతులు చేయించాలి. ఇప్పటికే వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. కుటుంబ సభ్యులతో బైక్లపై వెళ్లే వారు ప్రమాదాలకు గురై గాయాలైన ఘటనలు అనేకం ఉన్నాయి. ఆరు నెలలుగా పనులు పెండింగ్లో ఉన్నాయి. అధికారులు స్పందించి పనులు పూర్తయ్యేలా చూడాలి.

– శిరియాల రవికుమార్, చిక్లి, మాక్లూర్

వేరే కాంట్రాక్టర్తో చేయిస్తాం

నవీపేట, మాక్లూర్ మండలాలకు సరిహద్దులో ఉన్న జన్నేపల్లి వంతెనపై ఆరు నెలల క్రితం మరమ్మతు పనులు చేపట్టాం. కాంట్రాక్టర్ పని చేయనంటూ చేతులెత్తేయడంతో పనులు పెండింగ్లో ఉన్నాయి. వేరే కాంట్రాక్టర్తో పనులు చేపడతాం. చిక్లి, మాందాపూర్ రోడ్డుపై ఏర్పడిన గుంతలకు మరమ్మతులు చేయిస్తాం.

– గులాబ్ సింగ్, ఆర్అండ్బీ ఏఈ, మాక్లూర్

‘స్వచ్ఛదనం – పచ్చదనం’ విజయవంతం చేయాలి



మాట్లాడుతున్న మండల ప్రత్యేక అధికారి

భీమ్గల్: ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టనున్న స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మండల ప్రత్యేక అధికారి విష్ణువర్ధన్రెడ్డి అన్నారు. మండలంలోని ఎంపీడీవో కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, ఉపాధి హామీ, ఇందిర క్రాంతి పథకం సిబ్బందికి కార్యక్రమంపై శుక్రవారం అవగాహన కల్పించారు. పారిశుధ్యం, గ్రీనరీని పెంచడమే లక్ష్యంగా ఈ నెల 5 నుంచి 9 వరకు ఈ కార్యక్రమాన్ని నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో సంతోష్ కుమార్, ఎంపీవో జావీద్, ఏపీవో నర్సయ్య, ఏపీఎం రవీందర్, పంచాయతీ కార్యదర్శులు, ఐకేపీ, ఉపాధి హామీ సిబ్బంది పాల్గొన్నారు.

మహాసభను జయప్రదం చేయండి

బాల్కొండ: పంజాబ్లో ఈ నెల 7న నిర్వహించే ఓబీసీ 9వ మహాసభను విజయవంతం చేయాలని బీసీ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు జోగు నర్సయ్య కోరారు. ముప్కాల్ మండల కేంద్రంలో సభకు సంబంధించిన వాల్ పోస్టర్లను శుక్రవారం ఆవిష్కరించారు. జనాభాలో 60 శాతం ఉన్న బీసీలకు అన్యాయం జరుగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. సభను బీసీలు విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో బీసీ విద్యార్థిసంఘం జిల్లా ఉపాధ్యక్షుడు ద్యాగ శేఖర్, నాయకులు పాల్గొన్నారు.

చెరువు నుంచి నీటి విడుదల



బాల్కొండ: మండల కేంద్రంలోని ఊర చెరువు నుంచి ఆయకట్టుకు వీడీసీ సభ్యులు శుక్రవారం నీటి విడుదల చేశారు. చెరువులో సమృద్ధిగా నీరు వచ్చి చేరడంతో చెరువు నుంచి ఆయకట్టుకు నీటి విడుదలను చేపట్టారు. వీడీసీ సభ్యులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

ఘనంగా ఎమ్మెల్యే సుదర్శన్రెడ్డి జన్మదిన వేడుకలు



సాలూరలో కేక్ కట్ చేస్తున్న నాయకులు



రెంజల్ కేజీబీవీలో కేక్ కట్ చేస్తున్న నాయకులు



నందిపేటలో..

బోధన్/ వర్ని/ నవీపేట/ రెంజల్/ బోధన్టౌన్/ ఎడపల్లి/ బోధన్ రూరల్/ నందిపేట్: జిల్లాలోని అన్ని మండలాల్లో మాజీ మంత్రి, బోధన్ ఎమ్మెల్యే పొద్దుటూరి సుదర్శన్రెడ్డి జన్మదిన వేడుకలను కాంగ్రెస్పార్టీ నాయకులు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. పలు చోట్ల ఆలయాల్లో పూజలు, రక్తదానం, అన్నదానం, ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు నోట్బుక్స్, ఆస్పత్రుల్లో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. సాలూర మండల కేంద్రంలో కేక్ కట్ చేసి పీహెచ్సీలో రోగులకు పండ్లు, ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు పార్టీ నాయకులు నోట్ బుక్స్ పంపిణీ చేశారు. వర్ని, రుద్రూర్, నవీపేట, రెంజల్, బోధన్, ఎడపల్లి, నందిపేట్ మండలాల్లో పార్టీ నాయకులు ఎమ్మెల్యే జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. నవీపేటలో పార్టీ నాయకులు జీపీ కార్మికులకు రెయిన్కోట్లను పంపిణీ చేశారు. రెంజల్లోని కేజీబీవీలో విద్యార్థినులతో కలిసి నాయకులు కేక్ కట్ చేశారు. వీరన్నగుట్టలో రక్తదాన శిబిరం నిర్వహించారు. బోధన్లోని ఏకచక్రేశ్వర, మారుతి మందిరాల్లో నాయకులు ప్రత్యేక ప్రార్థనలు చేపట్టారు. అనంతరం ప్రభుత్వ ఆస్పత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేసి అంబేద్కర్ చౌరస్తాలో కేక్ కట్ చేసి నాయకులు రక్తదానం చేశారు. ఎడపల్లిలోని పలు ఆలయాల్లో పార్టీ శ్రేణులు ప్రత్యేక పూజలు చేపట్టారు. వీఆర్ఆర్ ఫంక్షన్ హాల్లో రెడ్క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో పార్టీ నాయకులు రక్తదాన శిబిరం నిర్వహించారు.

పరిసరాలను శుభ్రంగా ఉంచాలి

ఆర్మూర్టౌన్: ప్రజలు ఇంటి పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని కౌన్సిలర్ ఖాందేశ్ సంగీత అన్నారు. పట్టణంలోని రెండో వార్డులో వైద్య, మున్సిపల్ శాఖ అధికారులతో కలిసి ఫ్రైడే డ్రైడేలో భాగంగా ఇంటింటికి తిరుగుతూ సీజనల్ వ్యాధులపై తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. హెల్త్ అసిస్టెంట్లు స్వప్న, శ్యామల, సౌందర్య, శంకర్, మహిళా సమాఖ్య సభ్యులు రాజవ్వ తదితరులు ఉన్నారు.

హాసాకొత్తూర్ వాసికి రాష్ట్ర అవార్డు

ఖలీల్వాడి: కమ్మర్పల్లి మండలంలోని హాసాకొత్తూర్ గ్రామానికి చెందిన ఉట్నూర్ నరేష్ రాష్ట్ర ఉత్తమ కమ్యూనిటీ మొబిలైజషన్ అవార్డు అందుకున్నారు. శుక్రవారం హైదరాబాద్లోని హరిహర కళా భవన్లో ఇంఫాక్ట్ ఇంటర్నేషనల్ ఫౌండర్ గంప నాగేశ్వర్రావు చేతుల మీదుగా అవార్డు అందుకున్నారు. లోక్ సత్తా అధినేత జయ ప్రకాష్ నారాయణ, సీనియర్ నటులు మురళీ మోహన్ రావు పాల్గొన్నారు.

డీఈ కార్యాలయంలో విచారణ

నిజామాబాద్నాగారం: జిల్లాలోని ఆర్మూర్ డి విజన్ కార్యాలయంలో శుక్రవారం వరంగల్ డీ ఈ విజిలెన్సు సంపత్రెడ్డి విచారణ చేపట్టారు. పెర్కిట్ సెక్షన్ పరిధిలో లైన్ఇన్స్పెక్టర్ యాదిరిగిని అకారణంగా సస్పెండ్ చేయడంతో సాక్షిలో కథనాలు వెలువడ్డాయి. విచారణ నివేదికను సైతం మళ్లీ ఆర్మూర్ డీఈకే త్వరలో పంపిస్తామని విజిలెన్సు డీఈ సంపత్రెడ్డి తెలిపారు.

అవయవదానం గొప్ప దానం



బోధన్లో మాట్లాడుతున్న మున్సిపల్ చైర్పర్సన్



ర్యాలీ నిర్వహిస్తున్న సభ్యులు, విద్యార్థులు

బోధన్: అన్ని దానాల కన్న అవయవ దానం చాలా గొప్పదని బోధన్ మున్సిపల్ చైర్పర్సన్ తూము పద్మశరత్ రెడ్డి అన్నారు. జాతీయ అవయవదాన దినోత్సవాన్ని పురస్కరించుకుని తెలంగాణ శరీర అవయవదాతల సంఘం ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా ఈ నెల 1 నుంచి 15 వరకు అవయవదాన అవగాహన పక్షోత్సవాలు నిర్వహిస్తోంది. ఇందులో భాగంగా శుక్రవారం పట్టణ కేంద్రంలో ఆ సంఘం, వివిధ లయన్స్ క్లబ్లతో కలిసి అవగాహన ర్యాలీ, సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా శరీర అవయవదాతల సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు కాట్రగడ్డ భారతి మాట్లాడుతూ.. తమ సంఘం నేతృత్వంలో రాష్ట్ర స్థాయిలో నిర్వహిస్తున్న అవగాహన పక్షోత్సవాలు ఈసారి బోధన్లో ప్రారంభించామని పేర్కొన్నారు. కళాశాల డైరెక్టర్ వై శ్రీనివాస్రావు, లయన్స్ క్లబ్ల ప్రతినిధులు ఐఆర్ చక్రవర్తి, పల్లెంపాటి శ్రీధర్, శ్యాంసుందర్ పహాడే, బాలగంగాధర్, మంజుల వాణి, శ్రీలక్ష్మి, వాణి, సభ్యులు పాల్గొన్నారు.

విద్యుత్ అధికారుల పొలం బాట



చేంగల్లో మాట్లాడుతున్న అధికారులు



మాక్లూర్లో..

భీమ్గల్/ మాక్లూర్: విద్యుత్ అధికారులు శుక్రవారం పొలం బాట నిర్వహించారు. భీమ్గల్ మండలంలోని చేంగల్లో విద్యుత్ శాఖ డీఈ హరిచంద్ నాయక్, ఏడీ వినోద్, ఏఈలు రూప్సాయి, గవస్కర్, అధికారులు పర్యటించారు. విద్యుత్ సరఫరా గురించి రైతులను అడిగి తెలుసుకున్నారు. వ్యవసాయ మోటర్లకు కెపాసిటర్లు పెట్టడం వల్ల కలిగే లాభాల గురించి రైతులకు వివరించారు. రైతులను పలు సమస్యలు అడిగి తెలుసుకొని, ట్రీ ట్రిమ్మింగ్, లూజ్ లైన్లను వంటి సమస్యలను పరిష్కరించారు. మాక్లూర్లో విద్యుత్ అధికారులు పొలం బాట చేపట్టారు. ప్రతి వ్యవసాయ మోటర్కు కెపాసిటర్లు బిగించుకోవాలని రైతులకు సూచించారు. ఏఈ గోపినాయక్, శ్రీనివాస్లు పాల్గొన్నారు.

విద్యుత్ సమస్యలు లేకుండా చూడాలి



ఆర్మూర్టౌన్: విద్యుత్ సరఫరాలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని, రైతులకు నాణ్యమైన విద్యుత్ను అందించాలని వరంగల్ ఎస్ఈ ఎంఆర్టీ అధికారిణి అన్నపూర్ణదేవి అన్నారు. పట్టణంలోని అంకాపూర్లో విద్యుత్ సబ్స్టేషన్ను పరిశీలించారు. రైతులకు విద్యుత్ సరఫరాలో ఏవైనా సమస్యలు తలెత్తితే వెంటనే స్పందించి మరమ్మతులు చేపట్టాలన్నారు. సబ్స్టేషన్ను ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేస్తూ ఎలాంటి సమస్యలు రాకుండా చూసుకోవాలన్నారు. ఆమె వెంట ఏడీఈ శ్రీధర్, సిబ్బంది ఉన్నారు.

తల్లిపాలే శ్రేష్టమైనవి



ఆర్మూర్లో అవగాహన కల్పిస్తున్న అధికారులు



సేవాలాల్ తండాలో..

- తల్లిపాల వారోత్సవాల్లో అధికారులు

ఆర్మూర్టౌన్/ బోధన్టౌన్/ వర్ని: పుట్టిన పిల్లలకు తల్లిపాలే శ్రేష్టమైనవని ఏసీడీపీవో జ్యోతి అన్నారు. ఆర్మూర్ పట్టణంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో శుక్రవారం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో బాలింతలకు తల్లిపాల ప్రాముఖ్యతపై అవగాహన కల్పించారు. తల్లిపాలు పట్టిస్తే వారిలో రోగ నిరోధక శక్తి పెరుగుతుందన్నారు. అలాగే గర్భిణులు, బాలింతలు అంగన్వాడీల్లో అందిస్తున్న పౌష్టికాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో సూపర్వైజర్ నలిని, విలాస్, అంగన్వాడీ టీచర్లు పాల్గొన్నారు. బోధన్ పట్టణంలోని ప్రభుత్వ, బస్తీ దవాఖానల్లో తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా బాలింతలకు తల్లిపాల ప్రాముఖ్యతను వివరించారు. అప్పుడే పుట్టిన బిడ్డకు తల్లిపాలు పట్టిస్తే ఆరోగ్యంగా ఉంటారన్నారు. సూపర్ వైజర్ రాధిక, వైద్యురాలు సారిక, సూపర్ వైజర్లు, అంగన్వాడీ టీచర్లు, ఆశ వర్కర్లు పాల్గొన్నారు. వర్ని మండలంలోని సేవాలాల్ తండాలో తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు చిన్నారులకు ఉపాధ్యాయులు మంగ, అధికారులు అన్నప్రాసన చేశారు. తల్లిపాల ప్రాముఖ్యతపై బాలింతలు, గర్భిణులకు వివరించారు.

గుంతలు పూడ్చివేత



గుంతలను పూడ్చివేస్తున్న నాయకులు

మాక్లూర్: మండలంలోని అడవి మామిడిపల్లి శివారులో జాతీయ రహదారిపై ఏర్పడిన గుంతలను టీడీపీ ఆర్మూర్ నియోజకవర్గ నాయకుడు దేగాం యాదాగౌడ్ పార్టీ కార్యకర్తలతో కలిసి శుక్రవారం మొరంతో పూడ్చివేశారు. కురుస్తున్న వర్షాలకు రహదారిపై భారీ గుంతలు ఏర్పడగా వాహనాల రాకపోకలకు ఇబ్బంది ఏర్పడుతోంది. దీంతో యాదాగౌడ్ ట్రాక్టర్లతో మొరం తెప్పించి రోడ్డుపై ఏర్పడిన గుంతలను పూడ్చివేశారు. స్థానికులు అభినందించారు.

ఎమ్మార్పీఎస్ సంబురాలు



సాలూరలో సంబురాల్లో పాల్గొన్న నాయకులు



పోచంపల్లిలో ఎమ్మార్పీఎస్ నాయకులు



ఆర్మూర్లో సంబురాలు నిర్వహిస్తున్న నాయకులు

బోధన్/ వేల్పూర్/ నందిపేట్/ వర్ని/ పెర్కిట్/ ఆర్మూర్ టౌన్/ బోధన్ టౌన్: ఎస్సీ వర్గీకరణపై సుప్రీం ధర్మాసనం ఇచ్చిన సానుకూల తీర్పుపై హర్షం వ్యక్తం చేస్తూ శుక్రవారం ఆర్మూర్, బాల్కొండ, బోధన్ నియోజకవర్గంలోని అన్ని మండలాల్లో ఎమ్మార్పీఎస్ నాయకులు శుక్రవారం సంబురాలు నిర్వహించారు. డప్పు దరువులతో ర్యాలీ నిర్వహించి ప్రధాన చౌరస్తాల్లోని బాబుజగ్జీవన్రాం విగ్రహానికి పూలమాలలు వేశారు. పటాకులు కాల్చి స్వీట్లు పంచారు. సుప్రీం కోర్టు ధర్మాసనానికి కృతజ్ఞతలు తెలిపారు. సాలూర మండల కేంద్రంలో ఎమ్మార్పీఎస్ నాయకులు సంబురాలు చేపట్టారు. వేల్పూర్ మండలం పోచంపల్లిలో ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. పడగల్లో నాయకులు ర్యాలీ నిర్వహించారు. నందిపేట్, వర్ని, కోటగిరి మండలాల్లో ఎమ్మార్పీఎస్ నాయకులు మందకృష్ణ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఆర్మూర్ మండలం సుర్బిర్యాల్, ఫత్తేపూర్ గ్రామాల్లో ఎమ్మార్పీఎస్ నాయకులు సంబురాలు చేపట్టారు. ఆర్మూర్ పట్టణంలో అంబేద్కర్ విగ్రహానికి మాదిగ సంఘాల నాయకులు పూలమాల వేసి నివాళులు అర్పించారు. బోధన్ పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తాలో ఎమ్మార్పీఎస్ నాయకులు సంబురాలు చేపట్టారు.



నందిపేటలో పాలాభిషేకం చేస్తున్న నాయకులు



కోటగిరిలో..



సుర్బిర్యాల్లో..



బోధన్లో..

విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందించాలి



ఆర్మూర్ టౌన్: వసతి గృహంలో ఉంటున్న విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలని ట్రెయినీ ఐఏఎస్ సంకేత్కుమార్ అన్నారు. పట్టణంలోని శాస్త్రీనగర్లో గల ఎస్సీ బాలిక వసతి గృహాన్ని శుక్రవారం ఆయన సందర్శించారు. విద్యార్థులకు ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. అనంతరం హాస్టల్ వార్డెన్లు రాజగంగారం, ఫర్జనా, సుమలత ఆయనను సన్మానించారు.

సినిమాలు తెలుగు/హిందీ/ఇంగ్లీష్



పీవీఆర్ మల్టీప్లెక్స్(ఆర్మూర్)

స్క్రీన్-1 – రాయన్ (తెలుగు) – 12.15, 7.10 కల్కి 2898 ఏడీ (తెలుగు) - 3.25, 10.20

స్క్రీన్-2 – డెడ్పూల్ 3డీ (తెలుగు)- 10.00, 4.00, 10.00, బడ్డీ (తెలుగు) 1.00, 7.00

స్క్రీన్-3 – యావరేజ్ స్టూడెంట్ నాని (తెలుగు) - 1.45, తిరగబడర సామీ (తెలుగు) 7.20, రాయన్ (తెలుగు) 10.30

స్క్రీన్-4 – శివం భజే (తెలుగు) - 11.00, 1.45 7.35, 10.20, ఉషా పరిణయం (తెలుగు) 4.30